## కాకమ్మ కథా ?!

అది జిల్లా హెడ్‌క్వార్టర్స్. అందువల్ల అన్ని డిపార్ట్‌మెంట్స్ కార్యాలయ భవనాలు అక్కడే వున్నాయి. నాలుగు ఆటలు నడిపే సినిమా హాళ్ళతో, ఎప్పుడూ ఏదో తినడానికి తాగడానికి సిద్ధంగా వుంచే హొటళ్ళతో, బార్లతో పట్టణమంతా పొద్దున లేస్తే సందడే సందడి. గడియారాల్లోని సెకన్లముల్లు వేగంగా కదిలినట్లు, జనం ఎవరి పని మీద వాళ్ళు.

మెయిన్ రోడ్డెమ్మటి ఆ పట్టణంలోని మురికినంతా నెట్టుకు పోయె పెద్ద కాలవ. ఆ కాలవ రెండు వొడ్డులను కలపడానికి అక్కడక్కడ వంతెనలు. నిర్మాణంలో వున్న

మరొక వంతెన కోసం రోడ్డు ప్రక్కమ్మటే వుంచిన సిమెంట్ పైపులు అనాధలకు ఆశ్రయాలు. వాళ్ళలో పుల్లయ్య ఒకడు.

బాల్యమంతా ఎలా గడిచింది చెప్పడు. యవ్వనంలో ఏం చేసింది చెప్పడు. చేతనైనన్ని రోజులు చేసుకొని బతికి, వృద్ధాప్యం నడుం వంచగ తొంభై సంవత్సరాలు నిండినా యింకా చావు తన దగ్గరికి రాదాయె అని అప్పుడప్పుడు బాధ పడుతూ వుంటాడు పుల్లయ్య. సన్నగా, పొడుగ్గా, పాత నీళ్ళకుండ రంగులో, సీసపు గోలీల్లాంటి కనుగుడ్లతో, సంకలో జోలె, చేతిలో కర్ర, చిరిగిన గుడ్డలతో, అదో మాదిరిగా యిండ్ల ముందుకెళ్ళి నిలుచుంటాడు. ఓ కుక్క పొద్దంతా వెంట తిరిగి రాత్రి అతని పక్కనే పడుకుంటుంది. అడుక్కున్నది తనకు కొంత కుక్కకు కొంత. అది అతనిలాగే పెడితే తింటుంది లేక పోతె అలాగే పడుకుంటుంది, కాని దేనిని ముట్టదు.

ఆ రోజు మధ్యాహ్నం బడి పిల్లలు తిండికొచ్చి తిరిగి వెళ్ళే వేళ, అడుక్కొచ్చుకున్న అన్నాన్ని కొంత కుక్కకు పెట్టి తను కొంత తినాలని మూట విప్పి కూర్చున్నాడు పైప్‌లో. పక్కనే వేప చెట్టు మీద వుండే కాకులు వచ్చి అక్కడ రాలే మెతుకులను తినడానికి వాలుతూ వుంటే, కుక్క వాటిని మధ్య మధ్యన కసురుతూ వుంది. వొస్తూ

పోతూ స్కూల్ విద్యార్థులు మెతుకుల కోసం వాటి పోటిని వింతగా చూస్తూ వుంటారు. అంతేకాదు చిన్న చిన్న రాళ్ళను తీసుకొని కాకులకు తగిలేలా విసురుతూ వుంటారు. ఆ రోజు స్కూల్‌కు వెళ్ళే వాళ్ళలో నుండి ఒకడు తన పుస్తకాల సంచిని వీపుకు అదిమి పట్టి, వంగి చిన్న రాయిసందుకొని గురి చూసి విసిరాడు. ఓ కాకి మెడను విరుచుకొని పడి రెక్కలను రెప రెప కొట్టుకొని దీనమైన శబ్దం చేసింది. తాను విసిరిన రాయి తగిలినందుకు సంతోషంగా చూస్తూ ముందు వెడుతున్న తన మిత్రులను ఆగమని కేక వేశాడు. కాకి ఆర్తనాదాన్ని విన్న పక్కనున్న చెట్టు మీద కాకులన్ని ఒక్కసారే గుంపుగా తరలి వచ్చి దెబ్బతిన్న కాకి చుట్టూర తిరిగి చూసి, నవ్వుతూ నిలుచున్న కుర్రవాని చుట్టూ మూగి తన్నసాగినవి. అనుకోని కాకులదాడికి బెదిరి పోతూ కుర్రవాడు వేగంగా పరుగెత్తి మిగతా విద్యార్థులను కలిసినా ఫలితం లేకపోయింది. అవి వెంటాడుతూనే వున్నవి. కుర్రాడు వేగంగా పరుగెత్తి పక్కనే వున్న స్కూల్ రూమ్‌లో దూరాడు. సిమెంట్ పైప్‌లో కూర్చొని చూస్తున్న పుల్లయ్య పెదాల మీద ఆలోచనలను వెదజల్లే నవ్వు కదిలింది.

"ఈ కాకులు...!" అంటూ నిన్న జరిగిన సంఘటన గుర్తు రాగానే అతని ముఖంలో ఓ మాదిరి ఈసడింపుతో

కూడిన విరక్తి భావం మెరిసింది. అటు యిటు కదిలి కూర్చొని చూపును దెబ్బతిన్న కాకి మీద నిలిపి నిన్నటి సంఘటనను తలచుకోసాగాడు.

**

ఉదయం కార్యాలయాలు మొదలయ్యే వేళ, దుకాణాలు తెరపడం వల్లరోడ్లన్ని రద్దీగా వున్నాయి. ఓ బస్సు కోర్టు ముందు చౌరస్తాలో కొచ్చి ఆగగానే కొందరు దిగుతున్నారు. మరికొందరు ఎక్కడానికి సిద్ధంగా పక్కకు నిలుచొని దిగేవాళ్లని చూస్తున్నారు.

రెప్ప పాటులో కలవరం మొదలయ్యింది.

ఎవరు ఎక్కేది ఎవరు దిగేది తెలియని పరిస్థితి.

ఓ దిగుతున్న వ్యక్తి కడుపులో పిడి బాకు దిగగానే రక్తం పక్కమ్మటి నిలుచున్న జనం మీద చిమ్మింది.

అంతే - ఓ చావు కేక !

మరొక గొడ్డలి వేటు !

అతను మొదలు నరికిన చెట్టులా నేలకూలాడు.

హంతకులు కసి తీర్చుకొన్న చూపులతో వెళ్ళిపోయారు.

మనిషి మనిషినే వేట !

తప్పు తనది మాత్రం కాదు అన్నట్టు బస్సు కదలి పోయింది.

ఆ ప్రాంతమంతా భయంతో గూడు కట్టుకొంది. ఎవడు హంతకుడోఎవడు అమాయకుడో తెలియని అయోమయ పరిస్థితి అక్కడ చోటు చేసుకుంది. ఒకరితో ఒకరు మాట్లాడటం మానేసి ఎవరి దారిన వాళ్ళు మౌనంగా పరుగు పరుగున పరారవుతున్నారు. కొద్ది దూరంలో వున్న పోలీసు, ట్రాఫిక్ కంట్రోల్ కోసం విజిల్ వూదుతున్నాడే తప్ప ఈ విషయాన్ని పట్టించుకున్నట్టు లేదు. ఎదురుగా వున్న షాపు వాళ్ళు తమ దుకాణాల షట్టర్స్ గుంజేసారు. పక్కనే వున్న పాన్ షాప్ వాడు తన షాప్ మూసి సందులో పడ్డాడు.

రోడ్డు మీద రక్తం మడుగులో మనిషి తన్నుకొని తన్నుకొని ప్రాణం వదిలాడు. వకీళ్ళకార్లు ఆవరణలోకి మళ్ళుతున్నాయి. వాటి వెనకాలే జడ్జిగారి'కారు వెళ్ళింది. ఒక్క పరుగున కుక్క పరుగెత్తి హతుని చుట్టూ తిరిగి వచ్చి పుల్లయ్య ముందు కూర్చొని మూగగా ఏదో గునుస్తూ బెదిరి బెదిరి చూస్తు వుంది. అప్పుడు దాని కళ్ళు తడి అయినవి.

మనుషులు మాత్రం ఎవరూ పట్టిచ్చుకోకుండా ఎవరి దారిని వాళ్ళు వెళ్ళి పోతూనే వున్నారు. ఎంతో సేపటికి కాని పోలీసు జీపు అక్కడికి రాలేదు.

**

నిన్నటి అమానుష సన్నివేశాన్ని తట్టుకోలేక పుల్లయ్య ఓసారి కళ్ళు మూసి తెరిచాడు. రెప్పల కింద ఊరిన నీరు బయటికి వెలికాయి. అప్పుడతని తడికళ్ళకు మసకమసగ్గా కనిపించే కాకుల గుంపులోకి తన గుడ్డలోని అన్నాన్ని వెదజల్లాడు.

రోజూ కాకులను తరిమే కుక్క ఈ రోజు ఏమీ అనకుండా తన ముందలి కాళ్ళపై తల ఆనించి కాకులను చూస్తూ పడుకుంది.

1989 ●